క్లుప్తంగా...

నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి నందిగామ మైత్రి ప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ సంస్థలైన ట్రాన్స్‌కాం ఇండస్ట్రీస్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ ఇంజనీర్స్, ఐటీ సీ, ఓకే నో మోడ్ హోమ్స్ తదితర సంస్థల్లోని వంద ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి అర్హతగల అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటలకు విజయనగర్‌కాలనీలోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఫోటోలు, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలి.

షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజాసింగ్ పంపిణీ చేశారు. ధూల్‌పేటలోని ఎమ్మెల్యే కార్యాలయంలో షాదీముబారక్ 152 చెక్కులు, కళ్యాణలక్ష్మి 5 చెక్కులు, ప్రభుత్వ పట్టాలు 5 అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాజాసింగ్ అందజేశారు. గోషామహల్ నియోజకవర్గం ప్రజలు కేంద్రరాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు సన్మానం



మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్‌ను సన్మానిస్తున్న వ్యాపారస్తులు

చార్మినార్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రతిరోజూ ముస్లిం ప్రజల సౌకర్యార్థం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన మజ్లిస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్‌ను చార్మినార్ మోతీగల్లీ పరిసర ప్రాంతాల్లోని వ్యాపారస్తులు ఘనంగా సత్కరించారు. బుధవారం సాయంత్రం మోతీగల్లీలోని ఆయన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు అనంతరం వ్యాపారస్తులు ఆయనకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు.

5 శాతం రాయితీ సద్వినియోగం చేసుకోండి



ఏఎంసి మోహన్‌రెడ్డికి ఆస్తి పన్ను చెక్కును అందిస్తున్న చెల్లింపుదారులు

యాకుత్‌పురా: ప్రభుత్వం వార్షిక ఆస్తిపన్ను చెల్లింపుపై కల్పించిన 5 శాతం రాయితీని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ) మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో పర్యటించారు. ప్రతి ఏడాది మాదిగానే ప్రభుత్వం ముందస్తు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ కల్పించిదన్నారు. ఇప్పటి వరకు రూ.2.62 కోట్ల ఆస్తి పన్ను పలువురు చెల్లించారన్నారు.

నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం దేవాలయ నూతన పాలక మండలి సభ్యులను ఎన్నుకున్నారు.సభ్యులు కె.యుగేందర్ రెడ్డి, ఎం.సంజీవ రావు, కృష్ణ, పాటి నారాయణ రెడ్డి, ఇ.అరవింద్ కుమార్, అమ్మరెడ్డి రుక్మారెడ్డి, టి.కీర్తి ప్రమాణ స్వీకారం చేశారు.

రిసాలబజార్‌లో ఇఫ్తార్ విందు

గోల్కొండ: ఇఫ్తార్ విందులు మానవతా విలువలు చాటుతాయని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి వృత్తిపని సంఘం అధ్యక్షులు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం గోల్కొండ రిసాల బజార్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సంఘం తరపున గత రెండు సంవత్సరాలుగా ఇఫ్తార్ విందులు నిర్వహిస్తున్నామన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్-ఏ-ఖదర్

పాతబస్తీలో పర్యటించిన పోలీస్ బాస్‌లు

చార్మినార్: ముస్లిం సోదరులు షబ్బె ఖదర్ వేడుకలను మంగళవారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రంజాన్ మాసంలో ఎంతో విలువైన రాత్రిగా భావించే 27వ రోజును ముస్లిం సోదరులు జగ్నేకీరాత్ పేరుతో రాత్రంతా జాగరణ చేశారు. ఇఫ్తార్ విందులు ముగించుకున్న ముస్లిం ప్రజలు షబ్బె ఖదర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రాత్రంతా జాగరణ చేస్తూ పవిత్ర ఖురాన్ పఠనం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయా ప్రాంతాలలోని మసీదులలో గడిపారు. చారిత్రాత్మకమైన మక్కా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేకంగా సామూహిక నమాజ్ నిర్వహించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు ఖురాన్‌లోని ముఖ్యమైన ఘట్టాలను చదివి వినిపించారు.



షబ్బె ఖదర్ సందర్భంగా పాతబస్తీలో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న ఐపీఎస్ అధికారులు

పరిశీలించిన పోలీస్ అధికారులు..

రంజాన్ మాసంలోని షబ్బే ఖదర్‌ను పురస్కరించుకొని నగర అదనపు పోలీసు కమిషనర్ విక్రం జీత్ మాన్, నగర ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ సుధీర్ బాబు, నగర జాయింట్ పోలీసు కమిషనర్ విశ్వ ప్రసాద్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు తదితరులు మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు చార్మినార్, మక్కా మసీదులను సందర్శించారు. మక్కా మసీదులో జరుగుతున్న ప్రత్యేక ప్రార్థనలను పరిశీలించారు.

పద్యం తెలుగువారి సొత్తు

గన్‌ఫౌండ్రీ: పద్యం తెలుగువారి సొత్తు అని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. మూడురోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న పద్యనాటకోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పద్యం అనేది కేవలం తెలుగువారికి మాత్రమే ఉంటుందని, తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి కారణం పద్యమేనని తెలిపారు. శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న మాట్లాడుతూ.... పద్యనాటకోత్సవాలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు.



ఆకట్టుకున్న యోగివేమన పద్య నాటకం

రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలోని మొఘల్‌పురా డివిజన్ షుకూర్ మహమ్మద్ మసీదులో బుధవారం చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 4.5 లక్షల పైచిలుకు రంజాన్ కానుకలు పంపిణీ జరిగిందన్నారు. మొఘల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుష్పాల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత



భాగవత్ కథ వేడుకలు ప్రారంభిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మనిషికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని సిక్వాల సమాజ్ అధ్యక్షులు, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. యాంత్రిక జీవనంలో మానవాళిక మానసిక ప్రశాంతత, మనశాంతి ఎంతో అవసరమన్నారు. సిక్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో బేగంబజార్ శృంగర్షి భవన్‌లో నిర్వహించిన నానిబాయికా మైరా భాగవత్ కథ ఆధ్యాత్మిక వేడుకలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

తోట చంద్రశేఖర్‌కు ఆహ్వానం



తోట చంద్రశేఖర్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న అధ్యక్షుడు కొమ్ముల నరేందర్

అబిడ్స్: ఈనెల 21వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందన సభ కార్యక్రమానికి రావాలని ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షులు తోట చంద్రశేఖర్‌ను ఆహ్వానించారు. బాబు జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే అభినందన సభకు రావాలని ఆయనకు ఆహ్వాన పత్రాన్ని సొసైటీ అధ్యక్షులు కొమ్ముల నరేందర్ అందజేశారు.

మంత్రి నిరంజన్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

సుల్తాన్‌బజార్: భూ కబ్జాల ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిను సీఎం కేసీఆర్ బర్తరఫ్ చేయాలని తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ.. జోగులాంబ జిల్లాలో మంత్రి చేసిన భూ కబ్జాలపై తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని, సాక్ష్యాధారాలతో సహా మంత్రి భూ కబ్జాలను నిరూపిస్తామని వెల్లడించారు. నిరంజన్‌రెడ్డి అక్రమాలపై 20 గంటల్లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈడీకి, సీబీఐకి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు విజయభాస్కర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుగేందర్ గౌడ్

గన్‌ఫౌండ్రీని సమస్యరహిత డివిజన్‌గా తీర్చిదిద్దుతాం



ప్రజల సమస్యలు తెలుసుకుంట్టున్న కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్

సుల్తాన్‌బజార్: గన్‌ఫౌండ్రీ డివిజన్‌ను సమస్యరహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ అన్నారు.బుధవారం డివిజన్‌లోని పలు ప్రాంతాలలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంటాక్ట్ సర్వేను నిర్వహించారు. కార్పొరేటర్ హాజరై వివిధ కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గన్‌ఫౌండ్రీ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల సమస్యలు ఉన్నాయని, ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు.

ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ అలవడుతుంది

గోల్కొండ: రంజాన్ ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ అలవడటంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గా ఖతీబ్ మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రీ అన్నారు. రంజాన్ పవిత్ర ప్రార్థనల సందర్భంగా గోల్కొండ రిసాలబజార్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రంజాన్ ఉపవాస దీక్షలకు ఎంతో అర్థం ఉందని, దీనివలన సంపూర్ణ ఆరోగ్యం లభించడమే కాకుండా దైవభక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో షేక్ ఇస్మాయిల్ రబ్బానీ, సయ్యద్ ఆజమ్ అలీ ఖాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అలీషాఖాద్రీ

అందరి సహకారంతోనే జియాగూడ అభివృద్ధి

జియాగూడ: జియాగూడ డివిజన్ అభివృద్ధి అందరి సహకారంతోనే సాధ్యం అవుతుందని జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. బుధవారం అన్నిపార్టీ నాయకులు, బస్తీ సంఘాల ప్రతినిధులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ బోయిని దర్శన్ మాట్లాడుతూ.... డివిజన్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దడానికి ముఖ్యంగా మంచినీరు. మురుగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తామన్నారు. జియాగూడ మిని ఇండియా కావడంతో అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందించడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. గోల్కొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చ అధ్యక్షుడు రాజేందర్‌కుమార్ డెగాన్, గోల్కొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చ కోశాధికారి ఆర్.ప్రేమ్‌కుమార్, పాల్గొన్నారు.



అన్ని పార్టీల పదాధికారులను సన్మానించిన కార్పొరేటర్ బోయిని దర్శన్

పారిశ్రామికవేత్తలకు తెలంగాణ రాజధానిగా మారాలి

నాంపల్లి: ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీ) ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో మహిళల కోసం రెండు రోజుల ఎంటర్‌ప్రెన్యూర్ మెంటర్‌షిఫ్ కార్యక్రమం జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా ఐకెపి నాలెడ్జ్ చైర్మన్, సీఈవో దీపాన్విత ఛటోపాధ్యాయ, ఇలికో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వనితా దాట్ల హాజరయ్యారు.ఈ సందర్భంగా దీపాన్విత ఛటోపాధ్యాయ మాట్లాడుతూ... ప్రపంచ ఆవిష్కరణల సూచీ ర్యాంక్‌లో భారత్ 40వ స్థానంలో ఉందన్నారు. ఇది స్టార్టప్‌లలో 19వ స్థానంలో, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌లో 121వ స్థానంలో ఉన్నట్లు వివరించారు.

జిఎన్ఐటిఎస్‌లో ఐడియా థాన్

గోల్కొండ: విద్యార్థుల ఆలోచనలకు పదునుపెట్టి, వారి ఆలోచనలకు రూపమివ్వడమే తమ ఉద్దేశ్యమని షేక్‌పేట్‌లోని జి. నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో యంగ్ ఇన్నోవేషన్ ఛాలెంజ్, ఐడియా థాన్ కాంపిటీషన్ నిర్వహించారు. కళాశాల ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాసవి, గీతం, వివిఎస్ఆర్, విజిఐటి, సిఎంఆర్ఎస్ తదితర కళాశాలకు చెందిన మొత్తం 20 టీంలు పోటీ పడ్డాయి. విజేతగా నిలిచిన గీతం-2 టీం, రన్నరప్‌గా నిలిచిన టీం ఇన్నోవేటర్స్ ఫ్రమ్ జీఎన్ఐటిఎస్ వారికి ప్రొఫెసర్ రమేష్ రెడ్డి బహుమతులు అందించారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

50 తులాల బంగారం చోరీ

గోల్కొండ: 50 తులాల బంగారంతో పాటు రెండు డైమండ్ నెక్లెస్‌లు చోరీకి గురి అయ్యాయి. ఈ సంఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సాలార్జంగ్ కాలనీలో నివాసం ఉండే మాజిద్ మంగళవారం రాత్రి ఆసిఫ్‌నగర్ దత్తాత్రేయ కాలనీలోని తన చెల్లెలి ఇంటికి ఇఫ్తార్ విందుకు వెళ్లాడు. కాగా అదే రోజు రాత్రి ఒకటిన్నర గంటలకు తిరిగి వచ్చాడు. కాగా ఇంట్లోకి రాగానే అతని బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని 50 తులాల బంగారం, రెండు నెక్లెస్‌లు చోరీకి గురయ్యాయి. కాగా ఇంటి బాల్కనీ తలుపులు పగులగొట్టి దొంగలు ఇంట్లోకి వచ్చి ఈ దొంగతనానికి పాల్పడ్డారు. ఈ విషయం మాజిద్ లంగర్‌హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కండరాల క్షీణత బాధితుల సమస్యలను పరిష్కరించాలి

సంతోష్‌నగర్: కండరాల క్షీణతతో బాధపడుతున్న వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టీఎండీఏ) రాష్ట్ర అధ్యక్షులు ఆలూరి వెంకట రెడ్డి కోరారు. బుధవారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మడపతి రవి కుమార్, ఉపాధ్యక్షులు కత్తుల బాలకృష్ణ, కార్యదర్శి మెట్టపల్లి శివ కుమార్‌లతో కలిసి నానక్‌రామ్ గూడలోని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కండరాల క్షీణీతతో బాధపడుతున్న వారికి ప్రధానంగా కేర్ టేకర్ గానీ.. కేర్ టేకర్ అలవెన్స్ గానీ క్షీణత బాధితులకు మంజూరు చేయాలన్నారు. అలాగే హెల్త్ కార్డు, న్యూట్రిషియన్ కిట్లు, దశలవారీగా బ్యాటరీ వీల్ చైర్స్, మెడిసిన్స్ ఇచ్చే పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు.



మంత్రి హరీష్ రావుకు వినతిపత్రం అందజేస్తున్న టీఎండీఏ అధ్యక్షులు ఆలూరి వెంకట రెడ్డి

ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు రీ నోటిఫికేషన్ ఇవ్వాలి

నాంపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు రీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు నాంపల్లిలోని సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు డబుల్ పీజీ నిబంధన పెట్టి టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఈ అంశంపై కొంత మంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో.. సింగల్ పీజీ చేసిన వారిని కూడా అర్హులుగా పరిగణలోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. అయితే కేవలం కోర్టును ఆశ్రయించిన వారికి మాత్రమే మే 17న జరిగే పరీక్షకు అనుమతి ఇచ్చారన్నారు. దీని కారణంగా కోర్టును ఆశ్రయించని మూడు వేల మంది అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. న్యాయస్థానం తీర్పుకు అనుగుణంగా సింగిల్ పీజీపై పీఈడీ పోస్టులకు రీ నోటిఫికేషన్ ఇచ్చి అందరికీ అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మద్దతు తెలిపారు.



ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

న్యాయవాదుల విధుల బహిష్కరణ

యాకుత్‌పురా: న్యాయవాదుల రక్షణ కోరకు కేంద్ర ప్రభుత్వం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును ప్రవేశ పెట్టాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసి కో-కన్వీనర్లు మాణిక్ ప్రభుగౌడ్, తిరుమాల్ రావు డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ కోర్టులో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం పురానీహవేలీలోని సిటి సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. విధులు బహిష్కరించిన న్యాయవాదులు కోర్టు ప్రధాన ద్వారం ముందు బయటయించి పెద్ద ఎత్తున నినాదలు చేశారు. నిరసన కార్యక్రమంలో సిటి సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి రఘువీరారెడ్డి, న్యాయవాదులు శివకుమార్ దాస్, వెంకట రమణ యాదవ్, ఇంద్రసేనారెడ్డి, చక్రధర్, కిషోర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సిటి సివిల్ కోర్టులో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఈద్గాల వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు

గోల్కొండ: రంజాన్ ప్రార్థనలకు గోల్కొండ సమీపంలోని కుతుబ్‌షాహీ ఈద్గా వద్ద ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. బల్దియా ఈఈ మోహన్ సింగ్ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈఈ మోహన్ సింగ్ మాట్లాడుతూ...ఈద్గా వద్ద ధ్వంసమైన షాబాద్ రాళ్లను తొలగించి వాటి స్థానంలో కొత్త రాళ్ళు వేస్తామన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఈ మోహన్ సింగ్, అజీజ్‌ఖాన్ పఠాన్ తదితరులు

ముస్తాబైన టోలీ మసీద్

జియాగూడ: చారిత్రాత్మకమైన కార్వాన్ టోలీ మసీదు రంజాన్ వేడుకలకు ముస్తాబైంది. యేటా రంజాన్ మాసపు రోజులలో మసీదుకు తాకిడి అధికంగానే ఉంట్టుంది. నగరం నుండే కాక వివిధ జిల్లాల నుండి సైతం భక్తులు వస్తుంటారు. మసీదును రంజాన్ మాసంలో సందర్శించి ప్రార్థనలు చేస్తే అనుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

కులీకుతుబ్‌షాహి సహకారంతో నిర్మాణం

గోల్కొండ కులీ కుతుబ్‌షాహి హాయంలో చార్మినార్, మక్కామసీదును నిర్మించిన కార్మికులు, కూలీలు ప్రతి రోజు తమ కూలీ డబ్బుల నుండి ఒక్కపైసా పోగు చేసి ఈ డబ్బుతో గోల్కొండలోని కులీకుతుబ్ షాహి వద్దకు వెళ్లి తాము పోగుచేసిన డబ్బుతో మసీదు నిర్మిస్తామని విన్నవించారు. దీంతో కులీకుతుబ్‌షా కార్వాన్‌లో విశాలమైన 27 ఎకరాల స్థలాన్ని కేటాయించాడు. 400 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ నిర్మాణం నేటికి చెక్కు చెదరలేదు. నేటికీ మసీదుకు ఎలాంటి రంగులు వేయలేదు. నాడు నిర్మించిన కట్టడం నేటికి అలాగే ఉండడం విశేషం.

మూసీపై గిరక వంతెన నిర్మాణం

నిండుగా మూసీ పారే ఆనాటి కాలంలో టోలీ మసీదు నిర్మాణానికి నదిపై వంతెనను నిర్మించి గిరకను ఏర్పాటు చేశారు. మసీదు నిర్మాణానికి కావాల్సిన నీటిని గిరక ద్వారానే తోడి మసీదు నిర్మాణం పూర్తి చేశారు. కాల క్రమేణ వంతెన గిరక పంట పొలాలకు సైతం వాడుకలోకి వచ్చింది. మసీదు నిర్మాణం కోసం వాడిన వంతెన గిరక పేరుతోనే మసీదు చుట్టుపక్కల ప్రాంతం గిరకపల్లిగా స్థిరపడి నేటికీ ఉంది.

పాతపుస్తకాల బావి

మసీదు ప్రాంగణంలో ఖురాన్ తదితర ఆధ్యాత్మిక పుస్తకాలు చిరిగితే వాటిని చెత్తా చెదారంలో పడవేయకుండా ఆ నాడు బావిని అప్పట్లో తవ్వారు. నగరంలో పలు ప్రాంతాలకు చెందిన వారు అల్లాకు సంబంధించిన చిరిగిన పుస్తకాలు ఇతర ఆధ్యాత్మిక వస్తువులను తీసుకువచ్చి ఇందులో వేస్తుంటారు. బావిలో నీరు పుష్కలంగా ఉండడంతో నేటికి అందుబాటులో ఉంది.



ఎన్నో ప్రత్యేకతలు

మసీదు నిర్మాణంలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ముఖ్యంగా టోలీ మసీదు 100 ఫీట్ల ఎత్తు ఉండగా 40 ఫీట్ల వెడల్పులో ఉన్న నీటి కొలనులో స్పష్టంగా మసీదు కనిపిస్తుంది. ఇది ఆనాటి నిర్మాణ శైలికి నిదర్శనంగా నిర్మిస్తుంది. తెలుపు, నలుపు రాళ్లతో చిన్నపాటి డిజైన్లతో నిర్మించిన ఈ కట్టడం ఎత్తుగా ఉన్న కారణంగా చార్మినార్ తర్వాత స్పష్టంగా నగరంలో ఎత్తయిన కట్టడాల్లో ఒకటిగా కనిపిస్తుంది. 100 ఫీట్ల ఎత్తులో ఉన్న కట్టడాన్ని పూర్తిగా తలను పైకి ఎత్తి చూడలేని వారి కోసం మసీదు లోపల ప్రత్యేక డిజైన్‌ను నిర్మించారు. చూపరులను ఆకట్టుకునే విధంగా ఉండి ఈ కట్టడం నాటి కూలీలకే సాధ్యమైంది.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు పూర్తి



టోలీమసీదు ఆర్కియాలజీ విభాగానికి చెందినది కాగా ప్రభుత్వం ద్వారా రంజాన్ పండుగకు ప్రత్యేక నిధులతో రహదారి మరమ్మతులు, మంచినీటి సౌకర్యం, విద్యుత్‌దీపాలతో మసీదు అలంకరణ, పార్కింగ్ తదితర సమస్యలను పరిష్కరించి రంజాన్ పండుగకు ప్రార్థనల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– సయ్యద్ దస్తగిరి పాషా, టోలీ మసీదు అధ్యక్షులు